## క్లుప్తంగా

### మద్యం విక్రేత అరెస్టు

పాకాల : మండలంలోని దామలచెరువులో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న పురుషోత్తంగుప్తాను స్థానిక పోలీసులు గురువారం అరెస్టు చేశారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో, ఈ మేరకు పోలీసులు పురుషోత్తం గుప్తా ఇంటిలో సోదాలు నిర్వహించి 27 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతుంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎస్‌ఐ మహేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కలుపు మొక్కల నివారణపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న ఏడీఆర్ డాక్టర్ సుమతి, విద్యార్థులు

తిరుపతి సిటీ: స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో పార్థీనియం కలుపు మొక్కల నివారణోత్సవాలలో భాగంగా గురువారం విద్యార్థులు, సిబ్బంది కలుపు మొక్కల నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి మాట్లాడుతూ వ్యవసాయదారులు తమ పొలాల్లో పార్థీనియం కలుపు మొక్కలను నివారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కలుపు మొక్క పంటకు పెద్దఎత్తున నష్టం కలిగిస్తుందన్నారు. పంటలలో సుమారు 40 శాతం, పశుగ్రాసంలో 90 శాతం దిగుబడిని తగ్గించే శక్తి ఈ కలుపు మొక్కకు ఉందన్నారు. క్యారెట్ గడ్డి, నక్షత్రగడ్డి, ముక్కపుల్ల మొక్క వంటి పేర్లతో ఈ కలుపు మొక్కను పిలుస్తారని తెలిపారు. ర్యాలీలో శాస్త్రవేత్తలు సుధాకర్, ప్రసాద్, లతా, విశ్వనాథ్, సిబ్బంది మదన్‌మోహన్, హారతి, పెద్దసంఖ్యలో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

### టోల్‌ఫ్రీ నంబర్లపై విద్యార్థినులకు అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ బ్యూరో, వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో వర్సిటీలో విద్యార్థినులకు గురువారం నేనే మీకు తెలుసా..! అనే కాన్సెప్ట్‌తో టోల్‌ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి రుయా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస, ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారి మునిశంకర్‌రెడ్డి, ఆర్పీఎఫ్ సీఐ సీకే మధుసూదన్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి విద్యార్థినులకు 100, 108, 104, 181, 112, 101, 1098, 139, 1930 టోల్‌ఫ్రీ నంబర్ల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ కిషోర్‌కుమార్, లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్లు విద్యావతి, యువశ్రీ, మాధురి, సుజాత, వజియా భాను, భార్గవి, విద్యార్థులు పాల్గొన్నారు.

### నేడు గ్రామసభ

చంద్రగిరి: ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులపై శుక్రవారం పాత ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ ముదికుప్పం రూప అధ్యక్షతన గ్రామసభ నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్య ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి స్థానిక ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నట్లు చెప్పారు.

### పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పౌర చైతన్య వేదిక నాయకులు

తిరుపతి సిటీ: సమాజంలో చిన్నారులు, మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు మానవ నాగరికతను ప్రశ్నిస్తున్నాయని పౌర సమాజ వేదిక అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, పరమేశ్వర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో మహిళలపై అత్యాచారాలు–హత్యలు అనే అంశంపై శనివారం జరగనున్న సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవీయ సమాజంలో నీతి, నైతికత, విలువలు, సంస్కృతి అనేవి రోజురోజుకూ క్షీణించిపోవడం దారుణమన్నారు. ఇది భవిష్యత్ తరాలకు పెనుముప్పు అని అభివర్ణించారు. కార్యక్రమంలో పౌరచైతన్య వేదిక జిల్లా కోశాధికారి హరీష్ , ఎల్ఎస్ లక్ష్మి, నవీన్ మహేష్ పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



చంద్రగిరి: అక్రమంగా తరలిస్తున్న ఇసుకాసురులపై చంద్రగిరి పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. చంద్రగిరి, ఏ.రంగంపేటలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సీఐ రామయ్యకు సమాచారం అందండంతో గురువారం దాడులు చేపట్టారు. వేర్వేరు చోట్ల ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని, స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు వాటిపై కేసులు నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# రాజకీయాలకు కేంద్రబిందువు.. ఎస్వీయూ



దేశంలోనే ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్న శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ ఇప్పుడు రాజకీయాలకు కేంద్రబిందువుగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక మూడు పార్టీల్లోని ఓ పార్టీకి అనుకూలంగా ఉండే ఉద్యోగులను అదే కూటమి పార్టీలోని మరో నేత ఒత్తిళ్ల మేరకు అధికారులు సంబంధం లేని శాఖలకు బదిలీ చేస్తున్నారు. దీంతో వర్సిటీలో అధికారుల తీరుపై ఇటీవల జిల్లాలో పర్యటించినప్పుడు సీఎం చంద్రబాబుకు పలువురు ఉద్యోగులు మొర పెట్టుకున్నారు. అయినా వర్సిటీలోని అధికారుల తీరు మారులేదు.

- ఇప్పటికే 128 మంది ఏకకాలంలో బదిలీ
- మరో 80 మందిపై బదిలీ వేటుకు రంగం సిద్ధం చేసిన అధికారులు
- అర్హత, అవగాహన లేని విభాగాలకు బదిలీ చేయడంపై ఉద్యోగుల ఆగ్రహం
- కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఓ పార్టీ సామాజిక వర్గాన్ని అణగదొక్కే యత్నం
- సీఎం పేషీకి వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో రాజకీయ క్రీడ రసవత్తరంగా మారింది. ఇందులో భాగంగా వర్సిటీ అధికారులు కూటమిలోని ఓ పార్టీకి చెందిన అనుచర వర్గాన్ని టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. ఒకే సామాజిక వర్గానికి వంత పాడుతూ ఇప్పటికే సుమారు 128మందిని అర్హత, అనుభవాలను లెక్క చేయకుండా నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా బదిలీ చేశారు. బదిలీ అయిన ఉద్యోగులకు ఆ విభాగంపై కనీసం అవగాహన, అర్హత లేకపోయినా వర్సిటీ అధికారులు పెద్ద సంఖ్యలో బదిలీ చేయడం దారుణమని అధ్యాపకులు, మేధావులు, ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

#### మరో 80 మందిపై వేటుకు సిద్ధం..!

ఇంతవరకు జరిగింది ఒక ఎత్తయితే, మరో రెండురోజుల్లో సుమారు 80 మందిపై బదిలీ వేటు వేయాలని రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇందులో కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఓ పార్టీకి చెందిన సామాజిక వర్గాన్ని అణగదొక్కాలనే పక్కా ప్రణాళికతో బదిలీలు చేపట్టినట్లు విశ్వసనీయ సమాచారం. బదిలీల ఫైల్‌పై ఓ అధికారి ఇప్పటికే సంతకం చేసి త్వరలో ఉత్తర్వులు జారీ చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

#### సీఎం పేషీకి ఫిర్యాదుల పరంపర

ఎస్వీయూలో బోధనేతర సిబ్బంది బదిలీల విషయంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఓ అధికారి వ్యవహరించడంపై పెద్దఎత్తున ఉద్యోగులు మనస్తాపానికి గురైన విషయం తెలిసిందే. వర్సిటీ ఏ విభాగంలో చూసిన అధికారుల నుంచి చిరుద్యోగుల వరకు బదిలీల దారుణంపైనే ప్రతి రోజు చర్చించుకుంటున్నారు. వర్సిటీలో జరుగుతున్న నిరంకుశత్వ పాలనపై స్థానిక ప్రజాప్రతినిధులకు, సీఎంఓ కార్యాలయానికి ఫిర్యాదులు అందాయి. అధికార పార్టీకి చెందిన కొందరు అనుచర ఉద్యోగులు, ప్రొఫెసర్లు మరోమారు మంత్రి లోకేష్‌ను, డిప్యూటీ సీఎంను నేరుగా కలసి ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అలాగే కూటమిలోని టీడీపీ, జనసేన పార్టీల అనుచరవర్గ ఉద్యోగులు నేరుగా సీఎం చంద్రబాబును సైతం కలసి ఫిర్యాదు చేసిన విషయం విదితమే.

## ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవం



విద్యార్థులు ప్రదర్శిస్తున్న జానపద నృత్యాలు

పాకాల : స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రపంచ జానపద దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం కళాశాల ప్రిన్సిపల్ బేబీశ్వర్‌రెడ్డి అధ్యక్షతన, శ్రీ వేంకటేశ్వర జానపద కళారూపాల సేవాసమితి ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల రవీంద్రబాబు మాట్లాడుతూ పల్లెల్లో సాధారణంగా మాట్లాడే భాషే మన జానపద గీతాలని తెలిపారు. విద్యార్థులు తెలుగు సాహిత్యంపై పట్టు సాధించాలని, జానపదాల పట్ల విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు తులసీరామిరెడ్డి, డ్యాన్స్ మాస్టర్ హేమంత్, ఎస్‌వీఎస్ హెచ్‌ఎం మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

#### ప్రజా జీవితంలో జానదం కళ మమేకం



జానపద కళాకారులను సత్కరిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: బిడ్డకు పాలిస్తూ తల్లి పాడిన జోలపాటే లాలిపదమై అది జనపదంగా మారిందని రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో గురువారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జానపద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపద కళను పరిరక్షించుకుని భావితరాలకు అందించి జానపద విశిష్టతను చాటాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులు జానపద ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం జానపద కళాకారులు శాంబోలు హరినాథ్, కన్నప్పగారి కేశవరెడ్డి, చంద్రబాబును ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఫణిభూషణ రెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, పొన్నాల జేజిరెడ్డి, మురళి, జయంత్, సుబ్రమణ్యంరెడ్డి, రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.

## స్మగ్లర్లను వెంటాడిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

- చంద్రగిరిలో ఎర్రచందనం దుంగలు స్వాధీనం

చంద్రగిరి: ఎర్రచందనం అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని వెంబడించి ఎర్రచందనం దుంగలు, కారుతో పాటు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ అధికారులు అదుపులోకి తీసుకున్న ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతోందని రహస్య సమాచారం అందడంతో గురువారం రాత్రి దోర్నకంబాల గ్రామ సమీపంలో అధికారులు వాహనాలను తనిఖీలను నిర్వహించారు. ఈ క్రమంలో ఓ కారు అధికారులను తప్పించుకుని వేగంగా చంద్రగిరి వైపునకు దూసుకెళ్లింది. దీంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు బైక్‌పై కారును వెంబడించారు. చంద్రగిరి టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద కారు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడంతో పోలీసులు నలుగురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకోవడంతో పాటు కారులోని 7 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిని తిరుపతి కపిలతీర్థంలోని ఎర్రచందనం పోలీసు స్టేషన్‌కు తరలించారు.



కారులో పట్టుబడిన ఎర్రచందనం దుంగలు

## చెప్పకుండా బయటకు ఎలా వెళ్తారు ?





ఓపీ వార్డును ఆకస్మిక తనిఖీ చేస్తున్న రుయా సూపరింటెండెంటు డాక్టర్ రవిప్రభు, రోగులతో కిటకిటలాడుతున్న ఓపీ వార్డులు

- వైద్యుల గైర్హాజరుపై రుయా సూపరింటెండెంట్ రవిప్రభు ఫైర్

తిరుపతి తుడా: జూనియర్ డాక్టర్ల నిరసన దీక్షలతో వైద్య సేవలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. తిరుపతి రుయా, స్విమ్స్ ఆస్పత్రుల్లో వైద్యుల నిరసనలు యథావిధిగా గురువారం కొనసాగాయి. ఈ క్రమంలో రుయాలో ఓపి సేవలకు ఆటంకం కలుగుతోంది. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు కొంతమందిని ప్రత్యామ్నాయంగా, మరికొందరికి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ క్రమంలో రుయా సూపరింటెండెంటు డాక్టర్ రవిప్రభు ఓపీ వార్డులను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల వారీగా నియమించిన సిబ్బంది, అందుబాటులో ఉన్న సిబ్బంది వివరాలపై ఆరా తీశారు. కొన్ని విభాగాల వైద్యులు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై ఆరా తీయగా ఒకరు కోర్టుకు వెళ్లారని, మరొకరు సెలవు పెట్టారని, ఇంకొకరు హాస్టల్‌కు వెళ్లారని, ఇలా సంబంధం లేని సమాధానాలు రావడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో విధుల పట్ల మరింత అంకిత భావంతో వైద్యులు పనిచేయాలని ఆయన సూచించారు. కనీస సమాచారం లేకుండా అక్కడికి వెళ్లారు? ఇక్కడికి వెళ్లారని చెప్పడం సరి కాదని హితువు పలికారు. ఓపీ సేవలకు రోగులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారని, రోగులకు మెరుగైన వైద్యం అందించడంపై వైద్యులు దృష్టి సారించాలని కోరారు. ఓపీ సేవల సమయంలో అనుమతి లేకుండా బయటకు వెళ్తే శాఖా పరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణ, హాస్పిటల్ అడ్మిన్ ఉన్నారు.



అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న వీఆర్‌ఓ భాస్కర్

## ఆక్రమణదారులకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

చంద్రగిరి: చంద్రగిరిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలను చేపట్టడంపై బుధవారం సాక్షి దినపత్రికలో ''కబ్జా కహానీ'' అన్న కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన తహసీల్దార్ శివరామ సుబ్బయ్య వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు గురువారం వీఆర్‌ఓ భాస్కర్ ఘటనా స్థలానికి చేరుకుని అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాలను చేపట్టిన వారిని విచారించి నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేయడంపై ఉన్నతాధికారులకు నివేదిక అందించి, ఆపై అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని తెలిపారు. మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.




'కబ్జా కహానీ' ఇటీవల సాక్షిలో వచ్చిన కథనం

## చేతివృత్తులతో మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళలకు కోర్సు మెటీరియల్స్‌ను అందజేస్తున్న నాగరాజు

తిరుపతి కల్చరల్: చేతివృత్తుల ద్వారా ప్రతి మహిళ స్వయం కృషితో ఆర్థికాభివృద్ధి సాధించి కుటుంబానికి బాసటగా నిలవాలని రాస్ మహిళా పొదుపు సంఘాల సంచాలకుడు వి.నాగరాజు పిలుపునిచ్చారు. రాస్–జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో జీవకోనలో ఏర్పాటు చేసిన మహిళలకు మూడునెలల ఆర్యవర్క్ శిక్షణను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ నేటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కుటుంబంలో ప్రతి ఒక్కరూ పని చేస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాకుండా జన్ శిక్షణ సంస్థ నిర్వహించే వివిధ రకాల చేతివృత్తులపై శిక్షణ తీసుకోవాలని కోరారు. తర్వాత జన్ శిక్షణా సంస్థాన్ ప్రోగ్రాం ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాస్ కార్యక్రమాల గురించి తెలియజేశారు. ఆర్య వర్క్ కోర్సుకు సంబంధించిన మెటీరియల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో రాస్ ప్రతినిధులు నాగేశ్వరరావు, శ్రీదేవి, రేవతి, మాధవి, 50 మంది మహిళలు పాల్గొన్నారు.

## నీటి సాంద్రత పరీక్షలు నిర్వహించండి



వాటర్ ఫిల్టర్ హౌస్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: నగర ప్రజలకు సరఫరా చేసే తాగునీటి సాంద్రతను పరీక్షించాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య సూచించారు. అన్ని వాటర్ ట్యాంకుల్లో నీటి సాంద్రత పరీక్షలు ప్రతిరోజు తప్పకుండా నిర్వహించాలని ఆమె ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. గురువారం సాయంత్రం మంగళం వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిల్టర్ హౌస్‌ను ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. నీరు ఎలా ఫిల్టర్ చేస్తున్నారు? ఎన్ని రకాల పరీక్షలు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన నీరు అందించాలని అన్నారు. అన్ని పరీక్షల రిపోర్టులు పక్కగా నమోదు చేయాలని, తనకు ప్రతిరోజు వాట్సాప్ మెసేజ్ చేయాలని అన్నారు. నగర ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా, ఎక్కడా నీరు వృథా కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ఎక్కడా కూడా వాటర్ పైపులు, మురుగునీటి పైపులైన్లు కలవకుండా నీటి కలుషితం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫరా పైప్‌లైన్ మరమ్మతులను సిబ్బంది పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే నగరంలోని ప్రధాన కాలువల్లో జరుగుతున్న సిల్ట్ తొలగింపు పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామి రెడ్డి, డీఈఈలు సంజయ్ కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శవంతమైన సమాజానికి పోలీసులే కీలకం

- జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు








బదిలీపై వెళ్తున్న అదనపు ఎస్పీలు కులశేఖర్, విమల కుమారిని సన్మానిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్: ఆదర్శవంతమైన సమాజ నిర్మాణం కోసం పోలీసు వ్యవస్థ ఎంతో కీలకం.. అది గుర్తెరిగి, తాము పని చేస్తూ జిల్లా పోలీసు యంత్రాంగంతో పని చేయించి, ఆదర్శవంతంగా అదనపు ఎస్పీలు కులశేఖర్, విమలకుమారి నిలిచారని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు. గురువారం శాంతి భద్రతల అదనపు ఎస్పీ కులశేఖర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీగా, నేర విభాగం అదనపు ఎస్పీ విమల కుమారి ఏసీబీ అదనపు ఎస్పీగా సాధారణ బదిలీపై వెళ్తున్న సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. స్థానిక పోలీస్ అతిథిగృహం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ అనేది ప్రతిరోజూ కొత్త సవాళ్లతో కూడుకుని ఉంటుందన్నారు. బదిలీపై వెళ్తున్న వారు తమవంతు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశారని కొనియాడారు. భవిష్యత్తులో వీరు ఇంకా బాగా పనిచేసి, అద్భుతమైన ఫలితాలను సాధించి సమాజంలో పోలీసుల ఖ్యాతిని మరింత పెంచుతారని, శ్రీవారి ఆశీస్సులతో సంతోషకరమైన జీవితాన్ని పొందాలని కోరుకుంటున్నట్లు ఆకాంక్షించారు. బదిలీపై వెళ్తున్న అదనపు ఎస్పీలు మాట్లాడుతూ కలియుగ దైవం వెంకటేశ్వరుడి ఆశీస్సులతో పోలీస్ శాఖ అండతో తిరుపతిలో సమర్థవంతంగా విధులు నిర్వహించడం గొప్ప అనుభూతిని మిగిల్సిందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు(పరిపాలన), నాగభూషణ రావు(శాంతిభద్రతలు), రాజేంద్ర (సెబ్), శ్రీనివాసరావు (సాయుధ దళం), జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

#### నాగభూషణం బాధ్యతల స్వీకరణ

తిరుపతి లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీగా నాగభూషణం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో తిరుపతి జిల్లాలో సీఐ, డీఎస్పీగా పనిచేశారు.

## ● కృష్ణాష్టమికి ఏర్పాట్లు



తిరుపతిలోని ఇస్కాన్ ఆలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతిలోని ఇస్కాన్ ఆలయంలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇస్కాన్ ప్రతినిధులు ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల కోసం క్యూలైన్లు, విద్యుత్ కటౌట్లు, స్వాగత తోరణాలను ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

## గ్రామసభల్లో ఉపాధి పనులు చూపాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు

తిరుపతి కల్చరల్: ప్రభుత్వం ఈనెల 23వ తేదీన చేపట్టిన గ్రామసభల్లో పేదలకు అనుకూలమైన స్థలాలలోని ఉపాధి పనులు చూపే విధంగా పేదలంతా గ్రామసభల్లో అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా నాయకులకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల పట్ల, దానికి కారణమైన యాజమాన్యం పట్ల కఠినంగా వ్యవహరించాలని, కార్మిక జీవితాలకు భద్రత కల్పించాలని కోరారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి నిర్వహించ తలపెట్టిన రెవెన్యూ సదస్సుల్లో రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుపేదలకు భూములు పంపకం చేయడానికి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైన భూములు గుర్తించాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.